పల్లె దవాఖానా ప్రారంభమెప్పుడో?

- రెంజర్లలో ఆర్నెళ్లక్రితమే పూర్తయిన పనులు
- మూణ్నెళ్లక్రితమే వైద్యశాఖకు అప్పగింత
- ఇప్పటికీ ప్రారంభించని వైనం

బాల్కొండ : ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దవఖానా పనులు పూర్తయి ఆరు నెలలు గడుస్తుంది. భవనాన్ని అధికారులు వైద్యాశాఖకు అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా, ఇప్పటికి ప్రారంభించ లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ మీటర్ కోసం పేచీ..

పల్లె దవాఖానా నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.12 లక్షల నిధులను మంజూరు చేసింది. పనులను టీఎస్ఐఎండీసీ ఆధ్వర్యంలో చేపట్టారు. నత్తనడకన కొనసాగిన పనులు ఆర్నెళ్లక్రితం పూర్తయ్యాయి. కానీ దవాఖానాలో విద్యుత్ మీటర్ కోసం కొన్నాళ్లు పంచాయతీ జరిగింది. దీంతో వైద్యాశాఖ వారు మీటరు బిగిస్తేనే తీసుకుంటామని పేచీ పెట్టారు. టీఎస్ఐఎండీసీ వారు ఎట్టకేలాకు మీటరు బిగించి వైద్యశాఖకు భవనాన్ని అప్పగించారు.

గ్రామ పంచాయతీలోనే వైద్యం..

పల్లె దవాఖానా నిర్మాణం పూర్తయిన ప్రారంభించకపోవడంతో గ్రామ పంచాయతీలో ఓ మూలన వైద్య సేవాలు అందిస్తున్నారు. గ్రామానికి డాక్టర్‌ను నియామించారు. కానీ పల్లె దవాఖానాలో సేవాలు అందించాల్సిన వైద్యుడు జీపీలో ఇరుకు గదిలో అందిస్తున్నారు. సబ్ సెంటర్ ఉండి కూడ ప్రయోజనం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పల్లె దవాఖానా భవనాన్ని వెంటనే ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రెంజర్లలోని పల్లె దవాఖానా భవనం

మా పరిధిలో లేదు..

రెంజర్ల పల్లె దవాఖానా భవన పనులు పూర్తి చేసి, వైద్యాశాఖకు భవనాన్ని అప్పగించారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రారంభం మాపరిధిలో లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో సమాచారం లేదు.

– డాక్టర్ చంద్రమోహన్, వైద్యాధికారి, మెండోరా

క్లుప్తంగా

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లోని పోచమ్మ గల్లీలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణ వివరాలను కాంట్రాక్టరును అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు రవి గౌడ్, పండిత్ పవన్, సంజయ్ సింగ్ బబ్లూ, నవీన్, చింటు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వర్ని: రుద్రూర్ మండల కేంద్రంలో ఆదివారం జై కిసాన్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పత్తి రా ము, ఉపాధ్యక్షులుగా కర్క అశోక్, పార్వతి రాము లు, కార్యదర్శిగా పార్వతి శేఖర్, కోశాధికారిగా గుర్ల గోపి, సహాయ కార్యదర్శిగా పార్వతి ప్రశాంత్, రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా చెరువుల పండుగ



జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్, తొర్లికొండ గ్రామాల్లో ఆదివారం ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి డప్పు వాయిద్యాల మధ్య బోనాలను ఊరేగించారు. అనంతరం పెద్ద వాగులో ఉన్న మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ చేతన విజయ్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాయిక రాజు, ఎంపీటీసీ జయ గిరిధర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వసుందర బోజన్న, తల్వేద గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వర్‌పూర్ తండాలో బడిబాట



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని రామేశ్వర్‌పూర్ తండాలో ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాలోత్ రవీందర్, ఉపాధ్యాయురాలు భారతి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, వసతుల గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పిల్లలను ప్రభుత్వ బడికి పంపించేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. కార్యక్రమంలో తండా పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



ఖలీల్‌వాడి: నగరంలో ఈనెల 25న నిర్వహించనున్న నిజామాబాద్ జిల్లా 8వ పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి రవి, సత్యం తెలిపారు. నగరంలోని కోటగల్లీలోని ఎన్ఆర్‌భవన్‌లో ఆదివారం పీవైఎల్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జూలై 4, 5 తేదీలో ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, సాయినాథ్, బండమీది నర్సయ్య, సాగర్, గంగాధర్, కత్తుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇందల్వాయి(డిచ్‌పల్లి): మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ మాటలను నమ్మే పరిస్థితి లేదు

మోర్తాడ్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చెప్పే మాటలను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని, బీజేపీపై ప్రజలకు అభిమానం పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్గట్ల మండలం తడపాకల్‌లో ఆదివారం బాల్కొండ నియోజకవర్గం మోర్చాల సంయుక్త సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు చెప్పేది ఒకటి చేసేది మరోటి అన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి అయ్యిందని, ప్రధాని మోదీ పరిపాలనకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్, జిల్లా నాయకులు పోతంకర్ లక్ష్మినారాయణ, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, ఖైజర్ బాయ్, గంగారాం, సర్పంచ్ సోమ పెద్దరాజారెడ్డి, ఎంపీటీసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తడపాకల్‌లో నిర్వహించిన మహాజన్ సంపర్క్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కేంద్రం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బోధన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సులోచన సూచించారు. అలాగే రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ నియోజకవర్గ నాయకుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గస్థాయి పార్టీ అనుబంధ మోర్చాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ విజయానికి పాటు పడాలన్నారు. నూతనంగా పార్టీ మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా నిమామకమైన జలం సర్పంచ్ రాజ్యలక్ష్మి హనుమంతుకు నియామక పత్రాన్ని అందించారు. నియోజక వర్గనాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డె మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, పార్లమెంట్ విస్తారక్ శ్రీధర్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్రవంతి రెడ్డి, ప్రవళికరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శైలేష్ కుమార్ పాల్గొన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సులోచన

ఎన్నికల్లో లబ్ధి కోసమే దశాబ్ది ఉత్సవాలు

వర్ని: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందని బీజేపీ రుద్రూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్ని హామీలు ఇచ్చినా, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ మండల కార్యదర్శి ఏముల గజేందర్, మాజీ సర్పంచ్ తోట శంకర్, నాయకులు వినోద్, సతీష్, నారాయణరావు, ఎక్ నాథ్, పార్టీ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆన్‌లైన్ క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి





సాలూర మండలంలో క్విజ్ పోటీలపై అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. వర్ని మండలంలో..

బోధన్‌రూరల్(బోధన్): యువతలో నైపుణ్యాన్ని వెలికితీయడానికి హైదరాబాద్ యూత్ డిక్లేరేషన్ ప్రేరణతో ఈనెల 18న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి అన్నారు. సాలూర మండలంలోని తగ్గెల్లి, ఫత్తేపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన క్విజ్ పోటీలపై యువతకు అవగాహన కల్పించి, పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు క్విజ్ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆసక్తిగలవారు 76618 99899 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్టర్ కావాలన్నారు. ఈ మాజీ ఎంపీటీసీ దేవ్‌రావ్, నాయకులు గౌస్, గంగాయప్ప, శివ, శ్యామ్, సాయిలు, జ్ఞానేశ్వర్, రజినికాంత్‌లు పాల్గొన్నారు.

వర్ని: మండలంలోని కూనిపూర్, జలాల్పూర్, సైదిపూర్, పులి క్యాంప్ గ్రామాల్లో యువతకు ఆదివారం రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణరెడ్డి అవగాహన కల్పించారు. ఆసక్తి గలవారు 7661 899 899 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్టర్ కావాలని కోరారు. నాయకులు వెంకట్ గౌడ్, సుధాకర్, కిషన్, జీవన్, వసంత్, వినోద్, సంతోష్ ఉన్నారు.

గోసంగిలు అన్నిరంగాల్లో ఎదగాలి

నిజామాబాద్‌నాగారం: గోసంగిలు రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో మరింత ఎదగాలని సీనియర్ న్యాయవాది, సామజిక ఉద్యమకారులు అడ్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో గల గొసంగి కుల సంఘ భవనంలో ఆదివారం 'గొసంగి యువజన సదస్సు' నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో గోసంగి యువత పాత్ర పెరగాలన్నారు. అనంతరం గోసంగి యువజన సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఈర్నాల వినోద్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఈర్నల గంగా రాజేశ్వర్, రేవల్లి సాయిలు, ప్రధానకార్యదర్శిగా పత్రీ సాయికుమార్, కోశాధికారిగా విభూది అనిల్, కార్యనిర్వహణ కార్యదర్శిగా గంధం సత్య, సహాయ కార్యదర్శులుగా గంధం భాస్కర్, రాసుల రాజు, ఈర్నాల పెంటన్న, క్లోం కిషన్, ప్రచార కార్యదర్శిగా క్లోం ఒడ్డెన్న, సంయుక్త కార్యదర్శులుగా ఈర్నాల శ్రీకాంత్, కర్రె శేఖర్, కొండపల్లి గంగాశంకర్, ఎక్జిక్యూటివ్ మెంబర్లుగా పత్రీ రమేష్, ఈర్నాల సాయికుమార్, డొక్క నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

2కే రన్‌ను విజయవంతం చేయాలి

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2కే రన్‌ను విజయవంతం చేయాలని ఏసీపీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గానికి చెందిన పోలీసులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, ప్రజలు 2కేరన్‌లో భారీగా పాల్గొనాలని కోరారు. నేడు ఉదయం 6గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు.

ఆర్మూర్ పట్టణంలో..

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా నుంచి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు



మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్‌లో ఆదివారం ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే వన భోజనాలు చేశారు.

సాటాపూర్ గ్రామంలో..



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ ఎఖార్‌పాష, కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

పోచమ్మ ఆలయంలో రుద్రహోమం



మాక్లూర్: మండలంలోని వేణుకిషాన్‌నగర్‌తండా శివారులోని నాగారం పోశమ్మ ఆలయంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. గుత్ప గ్రామానికి చెందిన విజయ్‌రావు, రామారావు ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం జరిగే మృతుంజయ హోమంతో ఉత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని విజయ్‌రావు తెలిపారు.

నేటి నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మాక్లూర్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఈ నెల 12 నుంచి 14వరకు నూతనంగా నిర్మించిన ఆలయంలో శివ పంచాయతన దాసాంజనేయ నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ నిర్వహించనున్నట్లు సర్పంచ్ పుల్లయ్యగారి భవాని రఘు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు అఖండ దీపారాధనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 14న విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం




బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ చిత్రపటాలకు దివ్యాంగులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్‌ను రూ.3016 నుంచి రూ.4016కు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు శివయ్య, శంకర్, చాందు, గంగారాం, గంగాధర్, లక్ష్మన్, బాలయ్యలు పాల్గొన్నారు.

పాముకాటుతో హమాలీ మృతి

నవీపేట: మండలంలోని మల్కాపూర్ శివారులో గల రైస్‌మిల్‌లో ఓ హమాలీ ఆదివారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజాన్ కుమార్(45) కొన్ని రోజుల కిందట తన భార్య కిరణ్ దేవితో కలిసి మల్కాపూర్ శివారులోగల రైస్‌మిల్‌లో హమాలిగా చేరాడు. ఆదివారం ఉదయం నిద్రిస్తున్న సమయంలో రంజాన్‌కుమార్‌ను పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	అనంత 11.10, కౌశిక్ శర్మ-1.10 స్పైడర్ మాన్ అక్రాస్ (తెలుగు) – 3.30 మేమ్ ఫేమస్ -6.35 పరేషాన్ -9.45
స్క్రీన్-2 –	టాన్స్‌ఫార్మర్స్ (3డి-తెలుగు)-10.40, 1.35, 4.30, 7.25, 10.20
స్క్రీన్-3 –	టక్కర్ 12.20, 6.30, 9.30 మేమ్ ఫేమస్ 3.20
స్క్రీన్-4 –	అన్‌స్టాపబుల్ 10.35 7.00 ఇంటింటి రామాయణం 4.05 9.35

నగర అభివృద్ధిపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- అర్సపల్లిలో వైకుంఠధామం పనుల పరిశీలన

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగర అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించారని, శరవేగంగా సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. నగర పరిధిలోని అర్సపల్లి వైకుంఠధామం పనులను ఆదివారం ఆయన మేయర్ నీతూకిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులను త్వరగా పూర్తిచేయాలని, ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ వస్తారని సిబ్బందికి తెలిపారు. రూ.1000 కోట్లతో నిజామాబాద్ నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిజామాబాద్ నగరంలో హైదరాబాద్ తరహా 4 వైకుంఠధామాలు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇది వరకే 15వ డివిజన్ అర్సపల్లిని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక నిధులతో సామాజిక భవనాలు, రోడ్లు, డ్రైనేజీ నిర్మించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వైకుంఠధామం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్తం

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ సమైఖ్య కాలనీ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులు కాలనీలో వీధులను, మురికి కాలువలను శుభ్రం చేశారు. అలాగే పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి కాలనీని సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీ అభివృద్ధి కమిటి ప్రధాన కార్యదర్శి కమలాకర్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచిన మాదిగ విద్యార్థులకు ఆదివారం పట్టణంలో మాదిగ ఎంప్లాయిస్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ట్రస్టు సభ్యులు విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. ట్రస్టు సభ్యులు డాక్టర్ పోచన్న, సాయన్న, గంగాధర్, చంద్రశేఖర్, బబ్లు, నర్సయ్య, రాజు, ప్రవీణ్, రాజ నరసయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఖలీల్‌వాడి: నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, ఎస్వీ రమ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర శివారులోని సమీకృత కలెక్టరేట్ పరిధిలోగల ఎల్లయ్య చెరువు వద్ద ఉన్న ప్రభుత్వం స్థలంలో ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో నగరానికి చెందిన నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈసందర్భంగా ఆదివారం వారు వారివద్దకు వెళ్లి, మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న భూ పోరాటాల గురించి పేదలకు వివరించారు. పేద ప్రజలకు తప్పనిసరిగా ఇళ్ల స్థలాలు అందించి, ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షల ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్, పార్టీ నగర కమిటీ కార్యదర్శి సూరి, సభ్యులు కృష్ణ, అనసూయ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.